క్లుప్తంగా

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ప్రారంభమైన పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచీలలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ శనివారం తెలిపారు. 6వతేదీ నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

బోనమెత్తిన చిన్నారులు



చిన్నగూడూరు : మండల కేంద్రంలోని రైజింగ్ సన్ టాలెంట్ ప్రైవేట్ పాఠశాలలో బోనాల వేడుకలను చిన్నారులు, ఉపాధ్యాయులు శనివారం నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులతో బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్ల నడుమ పోతురాజుల విన్యాసాలతో పాఠశాల నుంచి దాశరథి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గుడికి చేరుకుని అమ్మవారికి బోనం సమర్పించారు. డైరెక్టర్ కాలునాయక్, ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని పాత బజారులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సంగీత శనివారం తెలిపారు. విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మల తొలగింపుతో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నందినగర్, గుండ్లకుంట కాలనీ, స్తూపం కాలనీ, ఎల్‌బీజీనగర్, రాహుల్‌నగర్, ఎటిగడ్డతండా, రామచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, బతుకమ్మ విగ్రహం ఏరియా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ కాలనీ, ఈదులపూసపల్లి రోడ్‌లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

'వంకతాడు' సంకలనం పంపిణీ



డోర్నకల్ : కల్లుగీత కార్మికుల జీవితాలు కళ్లకు కట్టినట్లుగా రచించిన 'వంకతాడు' కవితా సంకలనం ఆకట్టుకుంటుందని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. శనివారం తెలుగు కాంప్లెక్స్ సమావేశంలో డాక్టర్ హరీష్ రచించిన 'వంకతాడు' కవితా సంకలనాన్ని తెలుగు భాషా ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు.పి.రాములు, శ్రీనివాస్,భాస్కర్, రామునాయక్ పాల్గొన్నారు.

రూ.50వేల ఫిక్స్‌డ్ డిపాజిట్

- మానవత్వం చాటిన ఇన్‌స్టా రఘు



కురవి : డోర్నకల్ మండలంలోని ముల్కలపల్లికి చెందిన రమేష్ ఎనిమిది నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. రమేష్‌కు భార్య, రెండేళ్ల పాప ఉన్నారు. గంగరబోయిన రఘు వారి దీనస్థితిపై కురవికి చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేశాడు. స్పందించి పలువురు రూ.50వేల నగదును అందించారు. వాటిని చిన్నారి పేరుతో కురవి పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాధితులకు కురవి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై వెంకన్న చేతులమీదుగా డిపాజిట్ పత్రాన్ని శనివారం అందించారు. పోలీసులు, దుడ్డెల వినోద్, బండారి కార్తీక్, కొత్తపెల్లి నవీన్, వినయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



మహబూబాబాద్ అర్బన్ : మానుకోట మున్సిపల్ పరిధిలోని సలార్ తండా, అనంతారం నూతన కలెక్టర్ కార్యాలయ సమీపంలో జర్నలిస్ట్‌కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం (సర్వే నంబర్ 255) గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమించారని స్థానికులు, గిరిజన రైతులు చెబుతున్నారు. లావణి పట్టా భూమిని తమకు పట్టా పాస్‌బుక్‌లు చేయాలని దళితులు, గిరిజన రైతులు కలెక్టర్ కార్యాలయం చుట్టు తిరుగుతున్న పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమించుకుంటే మాత్రం అధికారులు చూసి చూడనట్టు ఉంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

డోర్నకల్ : మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు బి.జస్వంత్ హార్డిల్స్‌లో, బి.నవనీత్ 400 మీటర్ల విభాగంలో మొదటిస్థానంలో నిలిచి హనుమకొండలో ఆది, సోమ వారాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ కృష్ణభాను, పీడీ గోవర్దన్ విద్యార్థులను అభినందించారు.

మరమ్మతులు మరిచారా?

పిచ్చిమొక్కలు,చెత్తాచెదారంతో పెద్దచెరువు పంటకాల్వలు

- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



పిచ్చిమొక్కలతో నిండిన బోదెపంపు, ఉసిరికపంపు కాల్వలు

గార్ల : గార్ల పెద్దచెరువు పరిధిలోని పంట కాల్వలు మరమ్మతుకు నోచుకోక పోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట కాల్వలు సక్రమంగా లేకపోవడంతో ప్రతీ ఏటా చివరి ఆయకట్టు పంటలు ఎండిపోయి అన్నదాతలు నష్టపోతున్నారు. వానాకాలం ప్రారంభమైన ఇరిగేషన్ అధికారులు పంట కాల్వలను త్వరగా మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. పెద్దచెరువు ఆయకట్టు కింద వానాకాలంలో 2,500 ఎకరాల్లో వరిపంట సాగు చేస్తున్నారు. ఈ చెరువుకు చింతముత్తిగాని తూము, మైసు తూము, సున్నం తూము, సంగళ్ల తూములున్నాయి. వీటినుంచి పంటలకు సాగునీరు వెళ్లే కాల్వలు చెత్తచెదారం, పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయాయి. దీంతో ఆయకట్టు కింద భూములకు సక్రమంగా నీరందక రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

నిధులు మంజూరైన పనులు చేయలే..

పదేళ్ల క్రితం గార్ల చెరువు కాల్వల మరమ్మతులకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. చెరువు కట్టతో పాటు కాల్వల మరమ్మతు చేపట్టాల్సి ఉండగా చెరువుకట్టకు మాత్రమే మరమ్మతులు చేశారు. కాల్వలకు మరమ్మతు చేయకుండానే కాంట్రాక్టర్ బిల్లులు డ్రా చేసుకున్నాడని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. ఫలితంగా చెరువులో సమృద్ధిగా నీరు ఉన్న ఆయకట్టు భూములకు నీరందడం లేదు. సంగళ్ల కాల్వపై రెండుచోట్ల డ్రాప్‌లను అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. సేరుమిట్ట కాల్వ డ్రాప్‌ను సైతం స్లాబ్ వేయకుండానే వదిలేశారు. రామ్‌దయాల్, బోదెపంపు, ఉసిరికపంపు కాల్వలను మరమ్మతులు చేయకుండానే వదిలేశారు.

రైతులే నగదు జమచేసుకొని మరమ్మతులు..

పదేళ్లుగా కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ముళ్లకంప, పూడికతో నిండిపోయాయి. మైసు కాల్వ, చింతముత్తిగాని తూముల కింద కాల్వలు మరికొన్ని రోజుల్లో ఆనవాళ్లు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతీఏటా రైతులే డబ్బులు జమ చేసుకొని నామమాత్రంగా మరమ్మతులు చేసుకొని పంటలు పండించుకున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయంపై ఇరిగేషన్ ఏఈ వంశీని సాక్షి వివరణ కోరగా కాల్వల మరమ్మతులు చేయించేందుకు నిధుల కోసం పై అధికారులకు విన్నవించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు పనులు చేయిస్తామని పేర్కొన్నారు.

ఓసీ క్లబ్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



దీక్షను ప్రారంభిస్తున్న విజయసారథి

నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే వరకూ సీపీఐ పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. క్లబ్ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రజల కోసం వినియోగించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ నెల 4వ తేదీన చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామని, సీపీఐ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల ఫోరం నాయకుడు మైస శ్రీనివాస్, అడ్వకేట్స్ జేఏసీ నాయకులు మామిడాల సత్యనారాయణ, లెక్చరర్స్ ఫోరం నాయకుడు నీలం వెంకటేశ్వర్లు సీపీఐ దీక్షలకు మద్దతు తెలిపారు. అజయ్‌సారథి రెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, నర్ర శ్రావణ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



గార్ల : గార్లలోని గాంధీపార్క్ రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభానికి ఇనుప రాడ్లు తేలి, ఒరిగిపోయి కూలిపోయే దశలో ప్రమాదకరంగా ఉందని, విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, సిబ్బంది స్పందించి నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



కురవి: కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

కురవి : జిల్లా కేంద్రంలో ఈనెల 8వ తేదీన టీడబ్ల్యూజేఏ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మహాసభల ఆహ్వాన కమిటీ జిల్లా కన్వీనర్ బానోత్ లక్ష్మణ్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం టీడబ్ల్యూజేఏ సంఘం నాయకులు కురవి వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహాసభల కరపత్రాలను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్‌కు అందజేశారు. నాయకులు తాటి సుదర్శన్, మహేందర్ నాయక్, వెంకటేశ్, మోహన్, శ్రీనివాస్, బాలు, బోడ శరత్ పాల్గొన్నారు.

పని గంటల పెంపు జీఓను రద్దు చేయాలి

తెలంగాణ ప్రభుత్వం పనిగంటల పెంపు జీఓ 282ను రద్దు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు సావడి దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బంగారిగూడెం వాసవి టైల్స్, వాసవి డెకరేటివ్ టైల్స్ ఫ్యాక్టరీలో సంఘం సమావేశం నిర్వహించారు. నాయకులు లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, రెడ్డి, పద్మ, శారద పాల్గొన్నారు.

13న చలో హైదరాబాద్..

నెహ్రూసెంటర్ : హైదరాబాద్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న పింఛన్‌దారుల మహాగర్జనకు దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ పాష, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులి సోమయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం శనివారం నిర్వహించారు. మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సభను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మెలగూరి కుమార్, జెర్రిపోతుల నారాయణ, శ్రావణ్, జలేంద్రాచారి, వెంకన్న, ఐలయ్య, సంజీవ, భిక్షపతి, కిరణ్, మణీ ఉన్నారు.

రిలే దీక్షను..

మహబూబాబాద్ : బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్వహించనున్న రిలే దీక్షను విజయవంతం చేయాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ గోరిగే నర్సింహ కురుమ, తెలంగాణ జాగృతి నాయకుడు గందసిరి వేణు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం దీక్ష పోస్టర్లను వారు ఆవిష్కరించారు. హర్షిత్, సతీష్, శ్రీనివాస్, కరుణాకర్, శ్యామ్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్ : జీపీ కార్మికుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు సుధాకర్ కోరారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి మహాసభల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగన్న, సుధాకర్ మాట్లాడుతూ.. ఈ నెల 23, 24 తేదీల్లో గార్లలో జీపీ కార్మికుల రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో హుస్సేన్, అబ్బాస్, యాకయ్య, కిషన్, విజయ్, రాములు, లక్ష్మి, వెంకన్న, రాజు, మోహన్, వెంకన్న, లాలు, విజయ్, వీరేందర్, రాణి పాల్గొన్నారు.

లక్ష్మయ్య ఆశయాలను సాధించాలి

నెహ్రూసెంటర్ : కార్మిక ఉద్యమ నాయకుడు తెల్లబోయిన లక్ష్మయ్య ఆశయాలను సాధించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపూరి వీరభద్రం, హలావత్ లింగన్న, పర్వత కోటేష్, శివ్వారపు శ్రీధర్, నాగేశ్వర్‌రావు, శోభన్, జబ్బార్, యాకాంబ్రం ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

దంతాలపల్లి : లయన్ పీడీజీఎస్ వెంకటేశ్వరరావు జన్మదినం సందర్భంగా శనివారం డాక్టర్ సూర్నం రామనర్సయ్య మండలంలోని బొడ్లాడ ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. పాఠశాలలో మొక్కలు నాటి కాపాడాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చిదురాల నవీన్, క్లబ్ సెక్రెటరీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం : మున్సిపాలిటీకి చెందిన కోమటిరెడ్డి రామకృష్ణారెడ్డి ఇటీవల మృతిచెందాడు. శనివారం బాధిత కుటుంబానికి మండల టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చిలుముల మహేష్, ఉపాధ్యక్షుడు పింగిలి సంతోష్, నాగన్న, నర్సయ్య, గణేష్, గాడిపల్లి సంతోష్, రావుల అనిల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

నెల్లికుదురు : వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముంజంపల్లి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మేచరాజుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి వ్యవసాయ కార్మికులతో కలిసి శనివారం వినతిపత్రం అదించారు.

ఇంటి నిర్మాణానికి అడ్డుగా విద్యుత్ తీగలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని సోమ్లా తండాలో ధరావత్ విజయకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ క్రమంలో పిల్లర్ల నిర్మాణం చేస్తుండగా విద్యుత్ తీగలు పనులకు అడ్డువస్తున్నాయి. ఇదే విషయంపై ఆ శాఖ అధికారులకు తెలిపిన వారు పట్టించుకోవడంలేదని విజయ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

కనీస వేతనాలు పెంచాలి

మరిపెడ : పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య డిమాండ్ చేశారు. మరిపెడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనాల జీఓను సవరించి రోజు కూలీ రూ.800 ఇవ్వాలన్నారు. కార్మికులు పెండ్ర నాగమ్మ, ఓడపల్లి వెంకటలక్ష్మి, సమ్మక్క, వెంకటమ్మ, శాంతమ్మ, ఉపేంద్ర, ఎర్రమ్మ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణిస్తాం..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెం ఎంపీపీఎస్‌లో రోజు సాయంత్రం విద్యార్థులకు చివరి పిరీయడ్‌గా క్రీడలు, డ్రాయింగ్, ఆటలు, పాటలు, కిచెన్ గార్డెన్ నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయురాలు బి.శివలక్ష్మి, ఉపాధ్యాయులు సోమ రవి, సంధ్య విద్యార్థులు సహ పాఠ్యాంశాల్లో చురుకుగా పాల్గొనే విధంగా తీర్చిదిద్దుతున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్ : ఇష్టపడి పెళ్లి చేసుకున్న యువతిని తల్లిదండ్రులు తీసుకెళ్లారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. కాగా మాయమాటలు చెప్పి ఓ కానిస్టేబుల్, యువతి బంధువులు వేధింపులకు గురిచేస్తూ తన వద్దకు యువతిని రానివ్వకుండా చేస్తున్నారని ఆరోపించారు. బాధితుడి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలంలోని బంచరాయి తండా గ్రామానికి చెందిన బానోత్ శశికుమార్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతిని నెలరోజుల క్రితం హైదరాబాదులో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ విషయంలో యువతి తల్లిదండ్రులు, ఓ కానిస్టేబుల్, మరికొంత మంది కలిసి శశికుమార్‌ను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేస్తుండగా అవమానకరమైన మాటలతో అతడిని దూషించారు. భరించలేక పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శశికుమార్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి తల్లి పార్వతి మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై టౌన్ అడ్మిన్ ఎస్సై ప్రశాంత్‌ను వివరణ కోరగా ఫిర్యాదు మేరకు విచారించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విషాహారం తిని శునకాల మృత్యువాత

మహబూబాబాద్ రూరల్ : మాంసంలో విషం కలిపి పెట్టగా అది తిన్న తొమ్మిది శునకాలు మృత్యువాత పడిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ శనివారం చోటుచేసుకుంది. జెర్రిపోతుల శ్రీనివాస్ తెలిపిన కథనం ప్రకారం.. ముడుపుగల్ గ్రామానికి చెందిన వర్రె నరేష్ మాంసాహారంలో విషం కలిపి శునకాలకు పెట్టాడని అన్నారు. దీంతో తాము పెంచుకుంటున్న శునకంతో పాటుగా మరో ఎనిమిది మందికి చెందిన శునకాలు కూడా మృత్యువాత పడ్డాయని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారణమైన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరాడు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శునకాలను చంపిన నరేష్‌పై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపారు.

వృద్ధుడి అప్పగింత



నాగేశ్వర్‌రావును అప్పగిస్తున్న పోలీసులు

డోర్నకల్ : హైదరాబాద్ వైపు వెళ్తూ పొరపాటుగా డోర్నకల్‌లో రైలు దిగి స్టేషన్‌లో తిరుగుతున్న వృద్ధుడిని శనివారం ప్రభుత్వ రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏపీలోని పిడుగురాళ్లకు చెందిన వృద్ధుడు ఉడుగు నాగేశ్వర్‌రావు శనివారం రైలులో హైదరాబాద్ వెళ్తూ పొరపాటున డోర్నకల్ స్టేషన్‌లో దిగాడు. మూడో నంబర్ ప్లాట్‌ఫారం నుంచి రెండోనంబర్ ప్లాట్‌ఫారంకు వెళ్లేందుకు తడబడుతూ రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా గుర్తించిన జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, ఉపేందర్‌గౌడ్ సహకారంతో నాగేశ్వర్‌రావును పోలీసులు కుటుంబ సభ్యులను అప్పగించారు.

ప్రకృతిపై అవగాహన ఉండాలి



గార్ల : విద్యార్థులు ప్రకృతిపై అవగాహన కలిగి ఉండాలని విశ్వసమాజం వ్యవస్థాపకుడు జంపాల విశ్వ సూచించారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రకృతి పరిరక్షణ–విద్యార్థుల పాత్ర అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచభూతాలుగా పిలువబడుతున్న భూమి, గాలి, నీరు, అగ్ని, ఆకాశం మానవులతో పాటు సకల జీవరాశుల మనుగడకు మూలాధారమన్నారు. విశ్వ సమాజం ఇక నుంచి పంచ భూతాలను జీవ కారకాలుగా నామకరణం చేసి తీర్మానించిందన్నారు. ప్రతీ విద్యార్థి తన పేరుతో ఒక మొక్కను నాటి పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వేముల రవీందర్, ప్రిన్సిపాల్ రాజకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజ్ కుమార్

మరిపెడ రూరల్ : నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, ప్రజా రక్షణకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని మరిపెడ సీఐ రాజ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గుండెపూడి గ్రామంలో సీఐ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 40 మంది పోలీసులతో కలిసి ఇంటింటికి సోదాలు చేపట్టారు. 32 నంబర్ ప్లేట్, పత్రాలు లేని ద్విచక్రవాహనాలు, బెల్ట్ షాపుల నుంచి రూ.10,500 విలువైన మద్యం, 40 లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మరిపెడ ఎస్సై బొలగాని సతీష్, చిన్నగూడూరు ఎస్సై పిట్టల ప్రవీణ్‌కుమార్, సీరోలు ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం..

- సీడీపీఓ కమలాదేవి



పెద్దవంగర: సమావేశంలో మాట్లాడుతున్న కమలాదేవి

పెద్దవంగర : తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమని, శిశువు ఆకలి తీర్చడమే కాక రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి అన్నారు. శనివారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ శోభ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు తంగెళ్లపల్లి మల్లికార్జునచారితో పాటు ప్రతినిధులు హాజరై అంగన్‌వాడీ టీచర్లతో కలిసి చిన్నారులకు పలకలు అందజేసి అక్షరాభ్యాసం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్స్ అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడారు. ఎన్నో పోషకాలు ఉన్న అమ్మపాల ప్రాముఖ్యతపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఏదునూరి శ్రీనివాస్, ఎడవెల్లి మధుసూదన్ రెడ్డి, రాపోలు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గూడూరు : తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని, ప్రతీ తల్లి తప్పకుండా శిశువులకు పాలు తాగించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామలాదేవి అన్నారు. మండలంలోని సీతానగరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, పూలమ్మ, లక్ష్మి, కమల, రజితలతో పాటు ఎంపీపీఎస్ హెచ్‌ఎం పులి దేవేందర్, హెల్త్ స్టాఫ్ ఈశ్వరి, రమ్య, ఆశ వర్కర్లు పద్మ, కవిత పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెంపు

గార్ల : తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమైనవని, రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.సంధ్యారాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని అంకన్నగూడెంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుడు బాలు, టీచర్ రుక్కమ్మ, ఆయా, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే



చిన్నగూడూరు : మండల కేంద్రంలోని సమర్థ విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో చిన్నారులు ముందస్తు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. శనివారం పాఠశాలలో ఒకరినొకరు సంతోషంగా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకుని స్నేహాన్ని చాటుకున్నారు. కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

రెయిన్ డే వేడుకలు

తొర్రూరు రూరల్ : వర్షాలతోనే మానవ మనుగడ సాగుతుందని వికాస హైస్కూల్ కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని వెలికట్ట గ్రామశివారులోని వికాస్ హైస్కూల్‌లో రెయిన్ డే వేడుకలను జరుపుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పెసా'ను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు : ఏజెన్సీలోని లంబాడీ, ఆదివాసీలు పెసా కమిటీ నిబంధనలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగభవాని సూచించారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెసా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మద్యం దుకాణాలపై ఎజెండా అంశంగా చర్చించారు. పెసా జిల్లా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, ఎక్సైజ్ సీఐ భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి అశోక్, సభ్యురాలు ఐలబోయిన సమ్మక్క, గిరిజనులు బానోత్ లాలు, వాంకుడోత్ రామోజీ ఉన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి



మహబూబాబాద్ అర్బన్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు దాతలు ప్రోత్సహించాలని ఎంఈఓ శీలం వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థి పాకనాటి శ్రీలత జ్ఞాపకార్థం ఆమె కుమారై జమ్ముల శ్రీలత 10 మంది విద్యార్థినులకు నగదు పురస్కారం అందించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, శ్రీలత కుటుంబ సభ్యులు నా యిని ఉమాదేవి, పీవీ ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీవాని, విజయ్ కుమార్, సంజీవ, రంజాన్‌అలీ, ప ద్మావతి, సునీత, మంజుల, సుచిత్ర, రమాదేవి, చామతి, కౌసల్య, రజియా, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటుపడొద్దు

బయ్యారం : జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు విద్యార్థులు అలవాటుపడొద్దని ఎస్సై తిరుపతి సూచించారు. బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమణి, ఎన్ఎస్ఎస్ పీఓ సంతోష్, అధ్యాపకులు రాజు, కుమారస్వామి, స్నేహ, వెంకటలక్ష్మి, రాములు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

'బనకచర్ల'పై దుష్ప్రచారం చేయొద్దు

మహబూబాబాద్ : బనకచర్ల ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు దుష్ప్రచారం చేసి ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారని టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రామచందర్‌రావు శనివారం విమర్శించారు.

వేతనాలు అందించాలి

మహబూబాబాద్ అర్బన్ : మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అటెండర్లకు జీఓ 60ప్రకారం రూ.15,600 వేతనం అందించాలని తెలంగాణ రాష్ట్ర మండల విద్యావనరుల కేంద్రం మెసెంజర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు భిక్షపతి అన్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యాశాఖ అడిషన్ డైరెక్టర్ రాధారెడ్డికి శనివారం మెసెంజర్ల సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులు 60 జీఓ ప్రకారం వేతనాలను ఇవ్వాలని వినతి పత్రం అందించారు.

విద్యా ప్రగతికి వారధిగా మైనార్టీ గురుకులాలు

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థుల విద్యా ప్రగతికి వారధిగా మైనార్టీ గురుకులాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు మాట్లాడారు. తల్లిదండ్రులు పాఠశాల సమావేశం నిర్వహించినప్పుడు హాజరై సలహాలు సూచనలు అందించి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ మహ్మద్ ఇస్మాయిల్, తల్లిదండ్రుల పాఠశాల కోఆర్డినేటర్ బాదావత్ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గార్లలో బైక్ చోరీ

గార్ల : గార్లలోని జెండాబజారులో కలకోట రామారావుకు చెందిన హోండా యాక్టీవా బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇస్తాం..



చిన్నగూడూరు : అర్హులైన వారికి రేషన్‌కార్డులు అందజేస్తామని మరిపెడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ రావుల రాంరెడ్డి, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జీపీ ఆవరణలో తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ యాకయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డుల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కార్యదర్శి సోమన్న, నాయకులు మూల మురళీధర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు దాసరి రాజు, దొంగరి నర్సయ్య, బిక్కు నాయక్ పాల్గొన్నారు.